www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025

5

తూర్పుగోదావరి



దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎఎస్ఐ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాయుడు శ్రీనివాస్‌కు ఆయన శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జోడాల మాట్లాడుతూ మల్లవరానికి చెందిన రాయుడు శ్రీనివాస్ ఈ నెల 4న పంగిడిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. సాయి హాస్పిటల్‌లో చేర్చగా ఆపరేషన్‌కు రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. దాతల సేకరించిన రూ.11,422 ఆసుపత్రికి వెళ్లి అందిచానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోడాల రమాదేవి, వెంకట్ దంపతులు, దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవకు అంతరాయం

బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం
జిల్లాలో 90 నెట్ వర్క్ ఆస్పత్రులు
పేదల ఆరోగ్యానికి దూరమైన ఆసరా



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ వైద్యసేవకు అంతరాయం ఏర్పడింది. బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం ఆరోగ్య శ్రీ సేవలకు బ్రేక్ పడింది. జిల్లాలో ఈ పథకం ద్వారా 90 ఆస్పత్రులు రోగులకు సేవలందిస్తున్నాయి. వాటిలో ప్రభుత్వ ఆస్పత్రులు 36కాగా, ప్రైవేట్ ఆస్పత్రులు 39, ఇహెచ్ఎస్ 15 ఆస్పత్రులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,255 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ఎన్‌టిఆర్ వైద్య సేవగా పేరు మార్చిన విషయం విధితమే. అయితే నెట్ వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో శ్రద్ధ లోపించింది. ఈ నేపథ్యంలో బిల్లు బకాయిలపై ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) ఇప్పటికే పలు మార్లు విన్నవించుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆస్పత్రుల నిర్వహణ భారంగా మారిందని వైద్యులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, అప్పులు చేసి సేవలందించాల్సి వస్తుందన్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులకు ఒకొక్క ఆస్పత్రికి సుమారు 2 నుంచి రూ.10 కోట్ల మేర బకాయిలు నిలిచిపోవటంతో సుమారు రూ.100 నుంచి రూ.150 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది జిల్లాలో 90 శాతం ఆరోగ్యశ్రీ కేసులు జిల్లా కేంద్రానికే వస్తున్నాయి. అందులో ఎక్కువగా ఆర్థో, న్యూరాలజీ, యూరాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్ కేసులు ఉంటున్నాయి. కొన్ని ఆస్పత్రులలో స్పెషాలిటీ డాక్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో గైనిక్, జనరల్ సర్జరీ కేసులు మాత్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తుండగా, పిడియాట్రిక్ కేసులు ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ అవుతున్నాయి. గుండెకు సంబంధించిన కేసులన్నీ ఎక్కువ సంఖ్యలో కేసులు ప్రముఖ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎన్‌టిఆర్ వైద్య సేవ నిలుపుదల చేయటంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో సుమారు 10 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. ఇప్పటికే ఆస్పత్రులలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న వారికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందా అనేభయం వెంటాడుతోంది. జిల్లాలో ఇన్‌పేషెంట్లుగా ఇప్పటికే సుమారు వెయ్యి మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించి ఎన్‌టిఆర్ వైద్య సేవ అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

సంవత్సరం	సేవలు	నిధులు రూ.కోట్లలో
2019-20	25770	62.71
2020-21	29602	62.15
2021-22	47392	89.48
2022-23	97955	191.43
2023-24	10855	200.05
2024-25	106532	199.87
2025-26	60261	116.83

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.100 నుంచి రూ.120 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయి. కొన్ని ఆస్పత్రులలో మాత్రమే సేవలు నిలిచాయి. కొన్ని ఆస్పత్రులలో యథాతథంగా సేవలు కొనసాగుతున్నాయి. ఇన్ పేషెంట్స్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులలో పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులో ఉన్నాయి. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాము. ప్రతి నెట్ వర్క్ ఆస్పత్రిలో వైద్య మిత్రలు ఎన్‌టిఆర్ వైద్య సేవ కోసం వచ్చే రోగులకు పూర్తి సహకారం అందించేలా చర్యలు చేపట్టాము.

- డాక్టర్ ప్రియాంక ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ తూర్పుగోదావరి జిల్లా



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్‌సి, ఎస్‌టి ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం, నేషనల్ ఎస్‌సి, ఎస్‌టి హబ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ ఎస్‌సి, ఎస్‌టి హబ్ ద్వారా తొలిసారిగా రాజమహేంద్రవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశ్రమ స్థాపన ద్వారా ప్రగతి మార్గంలో నిలిచిన పారిశ్రామిక వేత్తలు అనుభవాలు యువ పారిశ్రామిక వేత్తలకు సూచికగా నిలిచే అవకాశం ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలకు చెందిన సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సబ్సిడీలు, మార్కెట్ అవకాశాలు, శిక్షణ, రుణ సౌకర్యాల గురించి పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. టాటా ఇన్నోవేషన్ హబ్ తరహాలో ఎస్‌సి, ఎస్‌టి హబ్ కూడా ఆయా వర్గాల వారికి మార్గదర్శకత్వం చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా జిల్లా ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం అవుతుందని తెలిపారు. అధికారులు కూడా ఈ దిశగా సమన్వయంతో చర్యలు తీసుకుని, పారిశ్రామిక వేత్తలకు మార్గదర్శకత్వం అందించాలనీ సూచనలు చేశారు. ఎస్‌సి, ఎస్‌టి హబ్‌లో రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

ఈ సందర్భంగా నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జోనల్ జనరల్ మేనేజర్ వి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తలకు శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెట్ యాక్సెస్ మరియు ప్రభుత్వ కొనుగోళ్లలో భాగస్వామ్యం కల్పించడం ఎస్‌సి, ఎస్‌టి హబ్ లక్ష్యమన్నారు. ఈ హబ్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ టెండర్లలో పాల్గొనడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక సబ్సిడీలు పొందగలరని చెప్పారు. మరింత సమాచారం కోసం నేషనల్ ఎస్‌సి, ఎస్‌టి హబ్, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్. టెక్నికల్ సర్వీస్ సెంటర్, కుషాయిగూడ, హైద్రాబాద్-500062 , టోల్ ఫ్రీ నెంబర్ లు 040-27125618, 27125718 లేదా nsshohyd@nsic.co.in సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం www.scsthub.in వెబ్‌సైట్ ం సందర్శించాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామన్ శ్రీనిధర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ పద్మజ, ఎన్‌ఎస్ఎస్‌హెచ్ ప్రతినిధి వేణుగోపాల్, శ్రీకాంత్ భట్టు తదితరులు మాట్లాడారు. ఎన్‌ఎస్ఐసి జోనల్ జనరల్ మేనేజర్ వి.సురేష్‌బాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామన్ శ్రీనిధర్, ఎల్‌డిఎం ఎం.ప్రసాద్, ఎన్‌ఎస్ఎస్‌హెచ్ ప్రతినిధులుఉభయ గోదావరి జిల్లా ల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలఆర్ట్స్ కళాశాలల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి మురళీకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ మంగాదేవి, సీనియర్ సైబర్ నిపుణులు వైఎస్‌వి.సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాల రకాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. తెలియని ఎపికె ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దన్నారు. సందేహాస్పద అంతర్జాతీయ కాల్స్‌కు



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

స్పందించరాదన్నారు. నకిలీ ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలను నమ్మరాదన్నారు. ఒటిపిలను ఎవరితోనూ పంచుకోరాదన్నారు. సీనియర్ సైబర్ నిపుణులు వై.ఎస్.వి. సురేష్ విద్యార్థులకు సైబర్ మోసాలు, ఫిషింగ్, ఆన్‌లైన్ స్కామ్‌లు గురించి వివరించి, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి యాప్‌ల పట్ల వ్యవహరించాల్సిన తీరును వివరించారు. ఎఐ ఆధారిత ఫోటో ఎడిటింగ్ యాప్‌లను దూరంగా ఉంచాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫిర్యాదు చేయాలని, లేదా www.cyber-crime.gov.inవెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సిఐ మంగాదేవి మహిళలు, విద్యార్థుల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీరామమూర్తి, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, డాక్టర్ కె.అనూష, సుభాషిణి, జి.రవితేజ, డాక్టర్ మురళీకృష్ణ, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

బోధనేతర పనుల బహిష్కరణ

ప్రజాశక్తి-గోకవరం

ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులను ఉపాధ్యాయులు బహిష్కరించారు. శుక్రవారం గోకవరంలో ఎంఇఒ ఎం.చిమ్మరాజుదొరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలల్లో బోధనకు మాత్రమే పూర్తి సమయాన్ని వెచ్చిస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా కార్యక్రమాలు ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు, పరీక్షల నిర్వహణ వంటి అవసరమైన పనులు నిర్వహిస్తామన్నారు. మిగిలిన బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామన్నారు. బోధనేతర పనుల వల్ల బోధనకు దూరమవుతున్నామన్నారు. బోధనేతర పనుల వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. వెంటనే బోధనేతర పనులున నిలిపేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగభూషణం, ఎం.ప్రేమకుమార్, పంతం త్రిమూర్తులు, ఎస్.కుమార్, శర్మ, నాగేంద్ర, బి.అప్పారావు, కె.శ్రీనివాస్, మక్బూల్ బాషా, విశ్వనాథ్, పి.బాలుదొర, వల్లభ పాల్గొన్నారు.

పనులను నూరుశాతం పూర్తి చేయాలి

కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గతేడాదని చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబరులో జరిగింది. ఈ సమావేశంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పనుల స్థితిని సమీక్షించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గతేడాది ఆమోదించిన పనులను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వాటికి సంబంధించిన వినిమయ ధ్రువపత్రం తక్షణం సమర్పించాలని ఆదేశించారు. వాయు కాలుష్య స్థాయి తగ్గినట్లు డేటా సూచిస్తున్నప్పటికీ, ఇంకా స్థిరమైన ఫలితాల కోసం సమగ్ర చర్యలు కొనసాగించాలని సూచించారు. మొత్తం రూ.7.32 కోట్లతో చేపడుతున్న గ్రీనింగ్ కారిడార్ల అభివృద్ధి పనులు, పెద్ద మొక్కల నాటడం, కిరా మియావాకి మోడల్ మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిపాదిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వాయు నాణ్యతను మెరుగుపరిచే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలన్నారు. ఇతర జిల్లాల్లో అమలు చేసిన సక్సెస్ స్టోరీల ఆధారంగా నివేదిక సమర్పించాలని, వాటి అమలుతో వాయు కాలుష్యాన్ని మరింతగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నిర్వహణను మరింత క్రమబద్ధంగా చేపట్టాలన్నారు. 2030 నాటికి మొత్తం వాహనాల్లో కనీసం 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు ఉండేలా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను సిఎన్‌జీ మోడ్‌కి కన్వర్ట్ చేసే చర్యలు వేగవంతం చేయాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న వాహనాల గణాంకాలు ఇవ్వాలని, 8 ఏళ్లు కాలం దాటిన వాటి వివరాలు సంబంధించిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల జరిగే మేలు వివరాపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తదుపరి సమావేశం నాటికి ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పిసిబి ఇన్విరాన్మెంట్ ఇంజినీర్ ఎంవిఎస్.శంకర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఆర్ఎంసి ఎస్ఇ పి.రీటా, డిఇ కె.లోవరాజు, కన్సల్టెంట్ ఎ.కోమలి, ఎఎంవిఐ సిహెచ్.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు నిరసనగా ఈ నెల 14 నుంచి గ్రామాల వారీగా కోటి సంతకాల సేకరణను చేపట్టనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. బొమ్మూరులోని వైసిపి కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దమన కాండ మొదలు పెట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి కక్ష సాధింపు రాజకీయాల వైపు మొగ్గు చూపుతుందన్నారు. దీన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని ఆయన తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలకృష్ణ

కొవ్వూరు : పేదలకు ప్రభుత్వ వైద్య సేవలను దూరం చేసే కుట్రలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. కోటి సంతకాల పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేంతవరకు వైసిపి పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి రాష్ట్ర గవర్నర్కు వినతి పత్రాలు అందజేయ నున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిసరకుడు గిరిజాల బాబు, మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్ కుమార్, గండ్రోతు సురేంద్ర కుమార్, సుంకర సత్యనారాయణ, ఉప్పులూరి సూరిబాబు, ఎంపిపిలు మట్ట వీరస్వామి, జొన్నకూటి పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యదేవా నర్సరీని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-కడియం

కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం కడియపులంకలోని శ్రీసత్యదేవానర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలోని ప్రత్యేకమైన వృక్షాల పెంపకం, ఆధునిక పద్ధతుల్లో మొక్కల ఉత్పత్తి, పెంపకం విధానాలను పరిశీలించారు. ముందుగా నర్సరీ అధినేత పుల్లా పెద్ద సత్యనారాయణ కలెక్టర్‌కు ప్రత్యేకమైన మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. నర్సరీలకు సంబందించిన పలు విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న పెద్దసత్యనారాయణ

ముఖ్యమంత్రికి విఒఎల కృతజ్ఞత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రెండు దశాబ్దాలుగా పోరాడుతున్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి,ఉద్యోగ భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు విఒఎలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విఒఎల యూనియన్ నాయకులు గద్దె రాజేశ్వరి మాట్లాడుతూ సర్క్యులర్ రద్దు హర్షణీయమన్నారు. తమ విధుల నిర్వహణకు అవసరమైన 5జి ఫోన్లను కూడా అందజేస్తామని ఇటీవల సంబంధిత మంత్రి ప్రకటించడం సంతోషకరమన్నారు. జీతాలను తమ బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలనే డిమాండ్లను కూడా నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం టి.రామకోటయ్య, విఒఎలు నందిగం హేమలత, మడిచర్ల జయసుధ, గారపాటి శ్రీదేవి, అరిగెల వెంకటలక్ష్మి, బిరుదు కోట భవాని, చల్లా కరుణ తదితరులు పాల్గొన్నారు.

పిఎం ఫసల్ బీమాపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

పంట కోత ప్రయోగాలను లక్ష్యానికి అనుగుణంగా చేయాలని మండల గణాంక అధికారి చిన్నం నాయుడు సిబ్బందికి సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుపై మండల స్థాయి సిబ్బందికి శిక్షణ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గణాంక అధికారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది పనిచేయాలన్నారు. పంట కోత ప్రయోగాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి సిబ్బందితోపాటు వ్యవసాయ శాఖ అధికారి రుచిత, విస్తరణాధికారి రాంబాబు, బిఎఒలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కండి : జెసి

ప్రజాశక్తి - కొవ్వూరు

జిల్లాలో సార్వా వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు సంసిద్ధం కావాలని జెసి వై.మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని వెంకటేశ్వర రైస్ మిల్లు, కాపవరంలోని జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్లులను ఆయన సందర్శించారు. మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్న గోనెసంచలపై ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన గోన సంచులు పంపించాలని ఆదేశించారు. కాపవరం దొమ్మేరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి, జిల్లా మేనేజర్ బి.గణేష్‌కుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎఒ ఎ.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లంకమాలపల్లి ఆసుపత్రికి క్వాలిటీ సర్టిఫికెట్

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఖండవల్లి-2 సచివాలయం(లంక మాలపల్లి) ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌కు క్వాలిటీ సర్టిఫికెట్ లభించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 9న నేషనల్ క్వాలిటీ యాజురెన్స్ స్టాండర్డ్స్‌ను సెంట్రల్ టీము వర్చువల్‌గా పరిశీలించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈ.తేజశ్రీ, సూపర్‌వైజర్ రాజేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎం స్వప్న, ఎంఎల్‌హెచ్‌పి రమ్యకృష్ణ, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు లంక మాలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌కు క్వాలిటీ సర్టిఫికెట్ సాధించారిన వైద్యాధికారి రాజనాల ప్రసాద్ తెలిపారు

కార్టూ'నిజం'



ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-కడియం

అంతర్జాతీయంగా బాలికలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, వైద్య, చట్టపరమైన హక్కులు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించడమే అంతర్జాతీయ బాలికా దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని కడియం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను తగ్గించి, వారి హక్కులను ప్రోత్సహించాలని, లింగ సమానత్వాన్ని పెంపొందించాలన్నారు. బాల్యవివాహాలు, సెల్ ఫోన్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు తదితర అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూసి సువర్ణవేణి, డిసిపి యూనిట్ ఎస్.పావని, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, శిరీష దేవి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల : అంగనవాడి టీచర్స్ ఆధ్వర్యంలో, అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నల్లజర్ల జడ్‌పి హై స్కూల్లో కిశోర బాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోమలి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ఎస్.శివకుమారి. ఎం.శాంతివల్లి. టి. దేవి. ఎన్. నాగలక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.



కడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఎ సత్యనారాయణ

చాగల్లు : చాగల్లు జడ్‌పి హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. బాలిక విద్య ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. బాలిక విద్య, బాల్య వివాహాలు నిర్మూలన, ఆత్మ రక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి హెచ్ఎం వాసవి, స్కూల్ టీచర్స్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పివి.పద్మావతి, పాల్గొన్నారు.

తాళ్లపూడి : సమాజంలో జరుగుతున్న అకత్యాలకు గురికాకుండా కౌమార దశలో ఉన్న విద్యార్థినిలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ భాగ్య కుమారి సూచించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెరవలి : ఐసిడిసి ప్రాజెక్ట్ పెరవలి కానూరు సెక్టార్ కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమం సెక్టార్ సూపర్‌వైజర్ వి.సరోజిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు గత నెల చివరి వారంలో తేతలి గ్రామానికి చెందిన గంటా గౌతమ్ కుమార్(27) పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. అతనికి భార్య, తొమ్మిది నెలల చిన్నారి ఉన్నారు. ఈ మనరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కలుపు మందు తాగిన మహిళ మృతి

ప్రజాశక్తి - పెరవలి

కలుపు మందు తాగిన మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకట దుర్గ కళ్యాణి లక్ష్మి(25) మృతి చెందింది. ఆమె ఈ నెల 5న కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆప్పటి నుంచి ఆమె చికిత్స పొందుతుంది. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

దారి దోపిడీ కేసులో రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

ఆగస్టు 12న రామచంద్రపురం ఎటుగట్టుపై జరిగిన దారిదోపిడీ కేసులో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 12న రామచంద్రపురం గ్రామానికి చెందిన చెవల సుబ్బారావు తన రెండో కుమార్తె వివాహం నిమిత్తం సీతానగరం వెళ్తున్నాడు. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు సీనీఫక్కీలో బండి నుంచి కింద పడిపోతున్నట్లు నటించారు. సుబ్బారావు పడిపోతున్న వాహనాన్ని పైకి లేవదీస్తుండగా దుండగులు సుబ్బారావు చొక్కా జేబులో రూ.20వేలను అపహరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. విచారణలో గోకవరం గ్రామానికి చెందిన మేకల రాము, నరుకుర్తి రాజులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,600 రికవరీ చేశారు. శుక్రవారం నిందితులను కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి పద్నాలుగు రోజులు రిమాండ్ విధించినట్లు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

అట్రాసిటీ కేసు కొట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో జరిగిన ఘటనలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో 32 మందిపై పెట్టిన అభియోగం రుజువు కాకపోవడంతో శుక్రవారం కేసును కొట్టివేస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2017 అక్టోబర్ నెలలో ఆలమూరు మండలం గుమ్మిలేరులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు గ్రూపులు మధ్య వివాదం ఏర్పడింది. దీంతో వారు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎస్ఐ ఎం.శేఖర్ బాబు విచారణ చేసి రెండు వర్గాలపై కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఆరు నెలల క్రితమే ఒక గ్రూపునకు చెందిన కేసును కొట్టి వేశారు. మరో కేసులో గుమ్మిలేరుకు చెందిన 38 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిలో ఆరుగురు అనివార్య కారణాలతో మృతి చెందడంతో ఈ కేసులో 32 మంది మిగిలారు. గత ఎనిమిది సంవత్సరాలుగా వాయిదాలు జరుగుతూ ఉండగా శుక్రవారం పూర్తి విచారణ అనంతరం 32మందిపై పెట్టిన అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి సాయి సునంద తీర్పు వెల్లడించినట్లు ఈ కేసులో న్యాయవాదులుగా ఉన్న ఎస్ఎస్.ప్రకాష్ రావు, నామన సీతారాంలు విలేకరులకు తెలిపారు.

యువకుని మృతి కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలికి చెందిన మురాల అనిల్‌దేవ ఆత్మహత్య కేసులో ఇద్దరికి రిమాండ్ విధించారని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. మునికూడలికి చెందిన మురాల అనిల్ దేవ ఉరి వేసుకొని చనిపోయాడు. దీనిపై దేవ అమ్మమ్మ సుభద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గత నెల 29న కేసు నమోదు చేశారు. ఈ నెల 3న కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్ష నిర్వహించారు. యువకుని మృతిలో నిందితులు బొబ్బిలిలంకకు చెందిన కప్పల సతీష్, రాజమండ్రికి చెందిన కాలుకురాస వరుణ్ అలియాస్ చిన్నగా గుర్తించి అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- గోకవరం

స్కూటీపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేవారు. సిఐ సత్యకిశోర్ తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన చింతల మురారీ, సూరి హేమంత్, దూలపల్లి నాని ఏజెన్సీ ప్రాంతం నుంచి స్కూటీపై గోకవరం మీదుగా రాజమహేంద్రవరంకు గంజాయిని తరలిస్తున్నారు. గోకవరం ఠాణా సెంటర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వెళ్తున్న వీరిని ఆపి తనికీలు నిర్వహించగా 11 కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటూ రెండు సెల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. మత్తుపదార్థాల రవాణా, విక్రయం, వాడకం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ తనిఖీల్లో గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయిని తరలిస్తున్న నిందితులు

కడియం అగరుబత్తీల మార్కెటింగ్‌కు చర్యలు

ప్రజాశక్తి-కడియం

హార్టి కల్చర్ వ్యర్థపూలతో మహిళలు అగరుబత్తీల తయారు చేయడం స్ఫూర్తి దాయకమని కలెక్టర్ కీర్తి చేకూరి అభినందించారు. మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవడం ప్రశంసనీయమన్నారు. కడియం ప్రాంతంలోని వ్యర్థపూలతో అగరబత్తుల తయారీ యూనిట్, కొబ్బరి తాళ్ల తయారీ యూనిట్లను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలతో సమావేశమై, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇదే రంగంలో మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.



అగరుబత్తీలను కలెక్టర్‌కు అందిస్తున్న కడియం మహిళలు

ఈ నేపథ్యంలో కలెక్టర్ మాట్లాడుతూ డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ స్థాపన ఉండాలనానద్రు. భవిష్యత్తులో ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో ముడి సరుకు లభ్యత నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ఆమేరకు కచ్చితత్వం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల చొరవతో 'కడియం నేచురల్ అగరబత్తులు" అనే ప్రత్యేక బ్రాండ్ రూపుదిద్దు కోవడం గర్వకారణమన్నారు. కెనరా బ్యాంక్ సహకారంతో తొలి దశలో 12 మంది మహిళలు యూనిట్ స్థాపనకు ముందుకు రావడం ప్రశంసనీయం అని తెలిపారు. శిక్షణ పొందిన 52 మంది మహిళలు కూడా ఇలాంటి యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, జిల్లా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అధికారి కె.శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపిడిఒ కె.రమేష్, ఎపిఎం ఆకుల నాగలక్ష్మి స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ర్యాపిడ్ పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ట్స్ కాలేజీ సమీపంలో ఉన్న ఎస్‌టి బాలికలు, బాలుర వసతిగృహాల్లో శుక్రవారం సికిల్ సెల్ ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించామని జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్‌టి బాలికల వసతిగృహంలోని మొత్తం 391 మందిలో 281 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. శుక్రవారం అందుబాటులో ఉన్న 70 మందికి పరీక్షలు చేశామన్నారు. ఎస్‌టి బాలుర వసతిగృహంలో 345 మందిలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, శుక్రవారం అందుబాటులో ఉన్న 35 మందికి సికిల్ సెల్ ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మీకుమార్, డిప్యూటీ డెమో ఎన్‌ఆర్‌పిఎస్.సత్యకుమార్, డిస్ట్రిక్ట్ ఎపిడమలజిస్ట్ డాక్టర్ సుధీర్, ఎఎంఒ అర్జున్, శ్రీనివాసరావు, జాన్సన్ రాజు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు

ప్రజాశక్తి- గోకవరం



గోకవరంలోని అదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రతి శుక్రవారం గర్భిణులకు గ్రోత్ స్కానింగ్ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రోత్ స్కానింగ్ కోసం ఇకపై రాజమహేంద్రవరం వెళ్లనవసరం లేదన్నారు. శుక్రవారం 69 మంది గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ చేశామన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎపిఒ సత్యవతి

బొబ్బిల్లంకలో 'ఉపాధి' గ్రామసభ

ప్రజాశక్తి - సీతానగరం

2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనులను గుర్తించేందుకు శుక్రవారం బొబ్బిల్లంక గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఎపిఒ సత్యవతి ఆధ్వర్యంలో ఈ గ్రామసభ జరిగింది. సర్పంచ్ మెల్లిమి రామచంద్రారావు అధ్యక్షతన జరిగిన సభలో వంద రోజుల పని కల్పించే లక్ష్యంతో చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటికి సభ ఆమోదం తీసుకున్నారు. ఈ పని ప్రణాళికను రూపొందించడంలో శ్రామికుల నుంచి అభిప్రాయాలు, అవసరాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఉపాధి హామీ పనులను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ గ్రామసభలో పంచాయతీ సెక్రటరీ సిహెచ్.భారతి, కూటమి నాయకులు పోలిన కృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆక్సిజన్ సిలిండర్లను అందిస్తునన విలియమ్స్ తదితరులు

ఆక్సిజన్ సిలిండర్ల అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్లను అందించడం అభినందనీయమని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలం పోచవరం గ్రామానికి చెందిన ఏప్రాయిము గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున విలియమ్స్ రూ.4లక్షల విలువైన 16 సిలిండర్లను ఆసుపత్రికి అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. విలియమ్స్ మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తమ ట్రస్ట్ ముందుంటుందన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ భావనరత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఆసుపత్రి వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల పట్ల గౌరవంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానసిక వికలాంగులపట్ల గౌరవంగా ఉండాలని సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు తెలిపారు. పాలంగిలోని స్పందన మెంటల్లీ రీహాబిలేషన్ సెంటర్, మానసిక వికలాంగులకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవల కమిటీ తణుకు చైర్మన్, తణుకు నాలుగవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు కోర్టు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ఈ సెంటర్‌ను పరిశీలించామని తెలిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులకు, వారి కుటుంబ సభ్యులతో ఏమైనా ఆస్తి తగాదాలు, ఇతర సమస్యలుంటే మండల న్యాయ సేవల కమిటీ తణుకు ద్వారా ఉచిత న్యాయ సాయం పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కామన మునిస్వామి, ఎ.అజయ్‌కుమార్, పారా లీగల్ వాలంటీర్లు కె.నాగమల్లీశ్వరి, ఎ.శ్రీదేవి, కాకర్ల నరసన్న, డి.బ్రహ్మాజీ, హెూం ఇన్‌ఛార్జి కె.సుచరిత, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం తదితరులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కరిబండి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల్లో నడుస్తున్న ఎస్‌కెజిఆర్‌అండ్ ఎస్ఎస్‌కె జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన డి.మహేష్ అండర్-19 సీనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి, ప్రిన్సిపల్ మురళి, లెక్చరర్లు డి.మాధవరావు, శ్రీను, రాజ్‌పాల్, ఎం.సత్యనారాయణ తదితరులు విద్యార్థిని అభినందించారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ

ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా శుక్రవారం చిన్నకొండెపూడిలో రాజమహేంద్రవరం వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. అపర్ణ ఏజెన్సీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిఎస్‌టి 2.0తో ప్రతి కుటుంబానికి రూ.15వేల వరకూ ఆదా అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భారతి, వివిధ ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రతి వారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి ఆయా శాఖాధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించారు. గ్రీవెన్స్ డేలో రెవెన్యూ పింఛన్లు, హెల్త్ పింఛన్లకు సంబంధించిన 11 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సాయి ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

మధ్యప్రదేశ్‌లో జరిగిన 14వ మోడరన్ పెంథాలన్ బైథిన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ - 2025 స్విమ్మింగ్ పోటీలలో శాయ్ క్రీడాకారుడు వీసం వెంకట నాగ సాయి మూడవ స్థానంలో నిలిచాడని సెంటర్ ఇంచార్జ్ ఎన్ ఉదయ్ కుమార్ తెలిపారు. సౌత్ ఆఫ్రికాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కొవ్వూరు

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కొవ్వూరు యూనిట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. వరుసగా నాలుగోసారి కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న కె.రవివిక్రమ్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డిటి కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, ఇతర ప్యానల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని రెవెన్యూ ఉద్యోగులు పూలమాలతో ఘనంగా సత్కరించారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

వైసిపి సంతకాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు శుక్రవారం 13వ వార్డులో సంతకాల సేకరణను ప్రారంభించారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తూ ప్రజలకు ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరించారు. మెడికల్ విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, దాన్ని వ్యాపార రూపంలోకి మార్చడాన్ని అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొట్టిన పవన్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, గోకిన సునేత్రాదేవి, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, వైసిపి నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, తలారి దొరబాబు, మేకా శ్రీనివాసరావు, తలారి దొరబాబు, సేపెని సురేష్, రెడ్డి లోవ కుమారి, పాలిక కుసుమ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ వైసిపి ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక రమణయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టి 50 వేల సంతకాలు చేసిన కాగితాలను జిల్లాస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అందిస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీ చేపట్టి వినతిపత్రాలిస్తామని తెలిపారు.కోటి సంతకాల పత్రాల సేకరణతో గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైసిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, జెడ్‌పిటిసి నురుకుర్తి రామకృష్ణ, షేక్ కరీంబాషా, నాజ్ వలి, గురునాథం, బెజవాడ సత్యనారాయణ, అనసూరి ప్రభాకర్, నేమాం చిన్న, గోపిశెట్టి బాబ్జి, విజయ సారథి, నల్లరాణి, పుల్ల కోటి, జాన్ ప్రభాకర్, కర్రి చక్రి, నాగబాబు, కొత్తపల్లి గిరీష్ పాల్గొన్నారు.

జగ్గంపేట కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను మాజీ మంత్రి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం ఆవిష్కరించారు. గండేపల్లి ఎంపిపి చలగళ్ళ దొరబాబు, పార్టీ బూత్ కమిటీల జిల్లా కన్వీనర్ ఒమ్మి రఘురామ్, పార్టీ నాయకులు రామకుర్తి జాగాలు, మూర్తి, కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, రావుల గణేష్ రాజా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైసిపి మహిళా నాయకులు

కల్తీ మద్యంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యంపై నిరసిస్తూ వైసిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగా గీతవిశ్వనాథ్ ఆధ్వర్యంలో కాకినాడలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి మద్యం సమయ పాలన లేకుండా విక్రయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న సాగర్, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైసిపి పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే బాణసంచా తయారీ

ప్రజాశక్తి- తాళ్లరేవు

అనుమతులు పొందిన మేరకే దీపావళి మందుగుండు సామగ్రి తయారు చేయాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. జి.వేమవరం రామాలయం పేటకు చెందిన శ్రీపార్వతీ పరమేశ్వర ఫైర్ వర్క్స్ యజమాని ఎర్రంనీడి ఆంజనేయులుకు ఆయన నోటీసు జారీ చేశారు. 15 కిలోల ఫైర్ వర్క్స్ మందుగుండు పౌడరుకు సంబంధించి అనుమతులు ఉండగా దానికంటే ఎక్కువగా మందు గుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మందుగుండు సామగ్రి తయారుచేసే కేంద్రంలో నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే నియమించాలని, తయారు చేసిన మందుగుండు సామగ్రిని నిర్దేశిత ప్రదేశంలోనే నిల్వ ఉంచాలన్నారు.

'ముదునూరి'ని కలిసిన ఎంపీ బోస్

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ధర్మవరంలో వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజును రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం కలిశారు. మురళీరాజు తండ్రి రామరాజు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బోస్ తనయుడు, వైసిపి రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో పేదల కొనుగోలు శక్తి పెంపు

ప్రజాశక్తి - కొవ్వూరు

జిఎస్‌టి 2.0తో పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరగనుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొవ్వూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. జిఎస్‌టి సంస్కరణల వల్ల ప్రాణాపాయ స్థితిలో వినియోగించే అత్యవసర మందులు, ఇన్సూరెన్స్‌లపై పన్నులు తగ్గాయన్నారు. జిఎస్‌టి తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావనరత్నకుమారి, టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయుడుచౌదరి, కంఠమణి రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ టైమింగ్ బెల్ బహూకరణ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తిమ్మరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అడ్డాల సత్య ప్రభాకర్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఆటోమేటిక్ టైమింగ్ బెల్‌ను శుక్రవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరామప్రతాప్, సీనియర్ రొటేరియన్స్ అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, ఎమ్‌డి ఫయాజ్, అడ్డాల సత్య ప్రభాకర్, యాసరపు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బెల్‌ను బహూకరిస్తున్న రోటరీ సభ్యులు